క్లుప్తంగా

ఎమ్మెల్సీ అభ్యర్థికి ఏపీ ఫార్మా జేఏసీ మద్దతు

కడప కార్పొరేషన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న తుమ్మెత అశ్వర్థరెడ్డికి ఏపీ ఫార్మా జేఏసీ మద్దతు ప్రకటించింది. జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మద్దెల సురేష్ బాబు ఆధ్వర్యంలో ఫార్మా అసోసియేషన్ సభ్యులు ఆయనకు సంఘీభావం తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. శ్రావణ్‌కుమార్, కోశాధికారి బి. ప్రణీత్, రాష్ట్ర కన్వీనర్ ఎస్. ఆదిరెడ్డి, రాష్ట్ర కో ఆర్డినేటర్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

కడప సెవెన్‌రోడ్స్ : ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుబ్రమణ్యం, మల్లికార్జున కోరారు. ఈ మేరకు సోమవారం డ్వామా కార్యాలయంలో అధికారికి వినతిపత్రమిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కొత్తకొత్త నిబంధనలతో ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. కూలీలకు 200 రోజుల పనిదినాలు కల్పించి ధరలకు అనుగుణంగా రూ.600 చొప్పున రోజుకూలీ ఇవ్వాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షులు రాయుడు, దొరబాబులు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో ముగ్గులపోటీలు

కడప సెవెన్‌రోడ్స్ : సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నామని డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి డీఎం ఓబులేశు, ఐద్వా నగర కార్యదర్శి జమీల ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11న రామకృష్ణ నగర్‌లో యువజన మహిళా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పోటీల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రదానం చేస్తామని వారు వివరించారు.

సీడీపీఓ, సూపర్‌వైజర్‌పై విచారణ జరపాలి

ఏఐటీయూసీ డిమాండ్

కడప సెవెన్‌రోడ్స్ : కడప రూరల్ ప్రాజెక్టు సీడీపీఓ రమాదేవి, చెన్నూరు సూపర్‌వైజర్ గుర్రమ్మ, ఆయా జ్యోతి వేధింపులపై విచారణ నిర్వహించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్, ఎల్.నాగసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం తమ సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కడప రూరల్ ప్రాజెక్టులోని ఐసీడీఎస్ చెన్నూరు సెక్టార్ 6వ వార్డులో అంగన్వాడీ వర్కర్‌గా పని చేస్తూ ఇటీవల ఆత్మహత్య చేసుకున్న సంధ్యారాణి మృతి సంఘటనకు సీడీపీఓ, సూపర్‌వైజర్, ఆయాల వేధింపులే కారణమని ఆరోపించారు. అక్కడి విషయాలు యూనియన్ నాయకులకు చేరవేస్తోందన్న నెపంతో ఆమెను మానసికంగా అనేక ఇబ్బందులకు గురి చేశారని తెలిపారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు మంజుల, ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా, నాయకులు మద్దిలేటి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

క్లాప్ మిత్రలకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

స్వచ్ఛభారత్ కార్మికుల ధర్నా

కడప సెవెన్‌రోడ్స్: గ్రామ పంచాయతీల్లో రోడ్లు, కాలువలు, పరిసరాలను శుభ్రం చేస్తున్న జగనన్న క్లాప్‌మిత్రలకు పది నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ స్వచ్ఛభారత్ కార్మికుల యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించింది. స్వచ్ఛభారత్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు హనుమంతు, శ్రీరాములు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్ ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్పంచులతో సంబంధం లేకుండా వేతనాలు ఇవ్వాలన్నారు. జీఓ 680 ప్రకారం వేతనాలు పెంచి కనీస వేతనం ఇవ్వాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా, నగర అధ్యక్షులు పి.సుబ్బరాయుడు, హుసేన్, స్వచ్ఛభారత్ కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షులు వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

పేరెంట్ కమిటీ సమావేశంలో హెచ్ టీచర్ నజీబుల్లా

కడప ఎడ్యుకేషన్: నేటి పోటీ ప్రపంచంలో చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎస్టీయూ జిల్లా మైనార్టీ కన్వీనర్, హెడ్ టీచర్ నజీబుల్లా పేర్కొన్నారు. కడప నగరపాలక పరిధిలోని మున్సిపల్ కార్పొరేషన్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో సోమవారం పేరెంట్ కమిటీ మీటింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా బడికి పంపాలన్నారు. విద్యాకమిటీ చైర్మెన్ షాలిమ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

పెండ్లిమర్రి: మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ ఎం.వరలక్ష్మి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అల్తాఫ్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. సర్వసభ్య సమావేశానికి ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

జన సంక్షేమమే జగన్ ధ్యేయం

- అవ్వాతాతలకు పెద్ద మనవడిగా పింఛన్ కానుక
- కొత్త సంవత్సరంలో రూ.2750కి పెంపు
- నగరంలో రూ.28వేల మందికి ప్రతినెలా రూ.8కోట్లు చెల్లింపు
- పింఛన్ వారోత్సవాలలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా


కొత్త పింఛన్లను పంపిణీ చేస్తున్న డిప్యూటీ సీఎం

కడప కార్పొరేషన్: జన సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా అన్నారు. పింఛన్ వారోత్సవాలలో భాగంగా సోమవారం స్థానిక వైఎస్సార్ ఆడిటోరియంలో కొత్తగా మంజూరైన పెన్షన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ అవ్వాతాతలకు పెద్ద మనవడిగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రూ.2500 పింఛన్‌ను రూ.2750కి పెంచారన్నారు. కడప నగరంలో మొత్తం 28వేల మంది లబ్ధిదారులకు ప్రతినెలా రూ.8కోట్లు చెల్లిస్తున్నామన్నారు. ప్రజా సంకల్పయాత్రలో చాలీ చాలని పింఛన్‌తో అవస్థలు పడుతున్న అవ్వాతాతలను వైఎస్ జగన్ స్వయంగా చూశారని, ఆత్మాభిమానాన్ని చంపుకొని జన్మభూమి కమిటీల చుట్టూ చెప్పులు అరిగేలా తిరగడం గమనించారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత లంచాలు, వివక్షకు తావు లేకుండా, రోజుల తరబడి పింఛన్ల కోసం వేచి చూడకుండా పింఛన్లను డోర్ డెలివరి చేస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సూర్యుడు ఉదయించక ముందే లబ్ధిదారులకు తలుపు తట్టి పింఛన్ అందిస్తున్న ఏకైక ప్రభుత్వం ఇదేనన్నారు. కన్నబిడ్డలు, కట్టుకున్నవారు కూడా చేయనివిధంగా ఒకటోతేదీనే పింఛన్ అందిస్తున్న ముఖ్యమంత్రిని అవ్వాతాతలు నిండు మనసుతో ఆశీర్వదించాలన్నారు. పింఛన్లు అందుకోవడంలో ఏమైనా ఇబ్బందులు వస్తే వార్డు సచివాలయాలను సంప్రదించాలని సూచించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, డిప్యూటీ మేయర్ ముంతాజ్ బేగం,నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మెన్ యానాదయ్య, కార్పొరేటర్లు పాకా సురేష్, కె. సూర్యనారాయణలు ప్రసంగించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సొహైల్, ఎన్. సుబ్బారెడ్డి, ఎస్ఎండీ జహీర్, షఫీ, షంషీర్, మియ్యా, బంగారు నాగయ్య, జమాల్‌వలీ, అరీఫుల్లాబాషా,సుభాన్, టీపీ వెంకట సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల అర్జీలను వేగంగా పరిష్కరించాలి



నగరపాలక సంస్థలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్

కడప కార్పొరేషన్: ప్రజల అర్జీలను వేగంగా పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలోని వీసీ హాలులో నిర్వహించిన «స్పందన» కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇంజినీరింగ్ విభాగం అర్జీలు-15, టౌన్‌ప్లానింగ్-19, రెవెన్యూ-5, యూపీఏ విభాగం-4, ఎస్టాబ్లిష్‌మెంట్-1, పీడీ, హౌసింగ్-7 అర్జీలు వచ్చాయి. వాటిని సమగ్రంగా పరిశీలించి గడువులోపు పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. తపాలలో వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించి అర్జీదారునికి రిప్లై లెటర్ పంపాలన్నారు.

– సోమవారం ఉదయం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన 9, 23 డివిజన్లలో పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. మెయిన్ రోడ్లపై గార్బేజ్ పాయింట్లను తొలగించాలన్నారు. క్లాప్స్ ఆటోలు ప్రతిరోజూ మూడు ట్రిప్‌లు తిరగాలన్నారు. రోడ్లు, కాలువల్లో ఏర్పడిన చెత్తను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ప్రతి వ్యాపార సముదాయం ట్రేడ్ లైసెన్స్ తీసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎస్ఈ రత్నాల రాజు, సీపీ సంజీవ్ కుమార్, డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, ఎంహెచ్ఓ డా. ప్రశాంత్‌వర్ధన్, ఈఈ నారాయణ స్వామి, డీఈలు కరిముల్లా, వేణుగోపాల్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

టెన్నిస్ టోర్నీ చాంపియన్స్‌గా ఉమైర్ జోడి


ట్రోఫీ అందుకుంటున్న ఉమైర్-సూర్యారెడ్డి జోడి

కడప స్పోర్ట్స్: గుంటూరు నగరంలోని ఆఫీసర్స్ క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన టెన్నిస్ చాంపియన్‌షిప్-2023లో పురుషుల డబుల్స్ విభాగంలో కడప నగరానికి చెందిన ర్యాంకింగ్ క్రీడాకారుడు షేక్ ఉమైర్, డి. సూర్యారెడ్డి జోడి విజేతగా నిలిచి ట్రోఫీ కైవసం చేసుకుంది. వీరు ఫైనల్స్‌లో విజయవాడకు చెందిన సాయికృష్ణ, అజయ్‌కుమార్ జోడిపై విజయం సాధించి విజేతలుగా నిలిచారు. అదే విధంగా 65 ప్లస్ పురుషుల విభాగంలో కడప నగరానికి చెందిన ఎస్.ఎ.రజాక్, రమేష్‌బాబు జోడి రన్నర్స్ నిలిచారు. విజేతలకు కాగా టెన్నిస్ క్రీడాకారుడు షేక్ ఉమైర్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎస్.బి. అంజద్‌బాషాకు స్వయాన అల్లుడు కావడం విశేషం. విజేతలకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

కోడి పందేలు చట్టరీత్యా నేరం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా పశుసంవర్థశాఖ అధికారి శారదమ్మ తదితరులు

కడప అగ్రికల్చర్: కోడి పందేలు నిర్వహించడం చట్టరీత్యా నేరం అని జిల్లా పశుసంవర్ధశాఖ అధికారి శారదమ్మ పేర్కొన్నారు. పోలీసుశాఖ ముద్రించిన కోడి పందేలు నిర్వహించడం- పాల్గొనుట చట్టరీత్యా నేరం అనే పోస్టర్స్‌ను సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంబంధింత పోస్టర్స్‌ను తమ సిబ్బంది ద్వారా మండల కేంద్రాల నుంచి గ్రామాలలో పంపిణీ చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ టోర్నమెంట్‌లకు క్రీడాదుస్తులు అందించాలి

- ఏపీ ఎస్‌జీఎఫ్ కార్యదర్శికి వినతి


ఏపీ ఎస్‌జీఎఫ్ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయ సంఘనాయకులు

కడప స్పోర్ట్స్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే టోర్నమెంట్‌లలో పాల్గొనే క్రీడాకారులకు క్రీడాదుస్తులు, రవాణ భత్యం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఏపీ పీఈటీస్ అండ్ ఎస్ఏపీడీ అసోసియేషన్ జిల్లా నాయకులు కోరారు. సోమవారం కడప నగరంలో ఏపీ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, వ్యాయామవిద్య రాష్ట్ర తనిఖీ అధికారి జి. భానుమూర్తిరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు మిద్దె ప్రవీణ్‌కిరణ్ మాట్లాడుతూ ఎస్‌జీఎఫ్ టోర్నమెంట్‌లకు వెళ్లడం విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. అదే విధంగా ఖేలోఇండియా అసెస్‌మెంట్ యాప్‌లో ఎదురవుతున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. సంఘ నాయకులు బి. నిత్యప్రభాకర్, ఎస్. సాజిత్, కె. రమేష్‌యాదవ్, విజయలక్ష్మి, వెంకటశ్రీక్ష్మి, సుబ్బమ్మ పాల్గొన్నారు.

బ్రౌన్ ప్రగతికి కృషి చేస్తా

- వైవీయూ ఇన్‌ఛార్జి వీసీ


ఇన్‌చార్జి వీసీని సత్కరిస్తున్న బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం ప్రతినిధులు

కడప కల్చరల్ : సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం, గ్రంథాలయం ప్రగతికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని యోగి వేమన విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ఆచార్య జి.రంగ జనార్దన అన్నారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన తొలిసారిగా సోమవారం రాత్రి రిజిస్ట్రార్ ఆచార్య వెంకట సుబ్బయ్యతోకలిసి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పరిశోధన కేంద్రంలో సేవలు అందిస్తున్న సిబ్బంది వారివారి విభాగాలు, విధుల గురించి ఆచార్య మూల మల్లికార్జునరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయానికి అవసరమైన వనరులను సమకూర్చేందుకు ప్రయత్నిస్తామన్నారు. కార్యక్రమంలో బ్రౌన్ కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథ పాలకులు రమేష్‌రావు, జి.హరిభూషణరావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక, సిబ్బంది నీలకంఠేశ్వర్,చంద్రకిశోర్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

సౌత్‌జోన్ చాంపియన్‌లకు అభినందన

వైవీయూ : తిరుపతి పద్మావతి విశ్వవిద్యాలయంలో ఈనెల 6,7 తేదీల్లో నిర్వహించిన 36వ దక్షిణ భారతస్థాయి అంతర్ విశ్వవిద్యాలయాల యువజనోత్సవాల్లో వైవీయూ ఫైన్‌ఆర్ట్స్ విద్యార్థులు చాంపియన్‌లుగా నిలవడంపై వైవీయూ నూతన వైస్ చాన్సలర్ ఆచార్య జింక రంగ జనార్ధన్ అభినందించారు. ఫిబ్రవరి 24న బెంగుళూరులోని జైన్ విశ్వవిద్యాలయంలో నిర్వహించే జాతీయస్థాయి యువజనోత్సవాల్లో రాణించి విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య మాట్లాడారు. ప్రిన్సిపాల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, కల్చరల్ విభాగం సమన్వయకర్త, ఆర్ట్స్ విభాగం డీన్ ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ డా. పి. సరిత, లలితకళల విభాగం సమన్వయకర్త కోట మృత్యుంజయరావు, ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం


1981-1992 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: కడప నాగరాజుపేటలో నగర పాలక ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 10వ తరగతి వరకు చదువుకున్న 1981-1992 బ్యాచ్‌కు చెందిన పూర్వపు విద్యార్థుల సమ్మేళనం సోమవారం ఘనంగా జరిగింది.

ఈ సందర్భంగా వారంతా ఒకరికొకరు ఆప్యాయంగా పలుకరించుకుంటూ ఆనాటి మధుర జ్ఞాపకాలను మననం చేసుకుని సంబరాల్లో మునిగి తేలారు. తమకు బోధనలు చేసిన ఉపాధ్యాయులను సత్కరించుకుని వారి నుంచి ఆశీర్వాదాలను పొందారు.

ఐకమత్యంతోనే సమస్యల పరిష్కారం


మాట్లాడుతున్న చీకటి చార్లెస్

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఐకమత్యంతోనే సమస్యలు పరిష్కారమవుతాయని వైఎస్సార్ కడప ఇండిపెండెంట్ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ చీకటి చార్లెస్ తెలిపారు. సోమవారం నగర శివార్లలోని ఇందిరానగర్‌లో క్రీస్తుసంఘం చర్చిలో దైవ సేవకుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 50 మండలాల్లో దైవ సేవకుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి నెలా ఒక సమావేశం నిర్వహించుకునేందుకు అసోసియేషన్ ఏర్పాటు చేశామన్నారు. కొత్త సంఘాల రిజిస్ట్రేషన్లు, చర్చిల నిర్మాణాలు, పాస్టర్లకు ప్రభుత్వం నుంచి వచ్చే గౌరవ వేతనం తదితర వాటి కోసం కృషి చేస్తామన్నారు. అనంతరం పలువురు సీనియర్ పాస్టర్ల సలహాలు, సూచనలు తీసుకుని సమస్యలు పరిష్కరించేందుకు దిశగా కృషి చేస్తామన్నారు. అసోసియేషన్ వైస్‌ప్రెసిడెంట్ ఏసయ్య, మిషనరీ కౌన్సిల్ చర్చి ప్రెసిడెంట్ పాలగిరి జాన్సన్, రిటైర్డ్ టీచర్ క్రిస్టఫర్ జాన్, పెనుబాల ఓబులేశు, పాస్టర్లు లక్ష్మినారాయణ, దొరస్వామి, ఆనందరావు, రాజశేఖర్, అజరయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పాలన

చెన్నూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పాలన కొనసాగిస్తున్నారని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్‌లు తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా నాడు చేపట్టిన ప్రజా సంకల్ప పాదయాత్ర పూర్తయిన రోజును పురస్కరించుకని సోమవారం వారు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పెడబల్లె జయభారత్‌రెడ్డి, మార్కెట్‌యార్డు డైరెక్టర్ కరీం, నియోజకవర్గ మైనార్టీ నాయకులు అన్వర్‌బాష, ఆకుల ప్రసాద్‌బాబు, వారిస్ పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో 175 స్థానాలు సాధిస్తాం

పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి


పెండ్లిమర్రిలో నూతన పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

వల్లూరు : ఎన్నికలు ఎపుడు వచ్చినా 75శాతం ఓట్లతో 175 స్థానాలను వైఎస్సార్ సీపీ కైవసం చేసుకుంటుందని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీడీపీ జుబేదా అధ్యక్షతన నిర్వహించిన వైఎస్సార్ పెన్షన్ కానుక వారోత్సవాల్లో ఆయన నూతనంగా మంజూరైన 124 మందికి పింఛన్ల నగదు మొత్తం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అవ్వాతాతల మోములో చిరునవ్వు చూడడమే సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి లక్ష్యం అన్నారు. గత టీడీపీ ప్రభుత్వం 39 లక్షల మందికి పింఛన్లు పంపిణీ చేస్తే వైఎస్సార్ సీపీ ప్రస్తుతం 64 లక్షల మందికి పింఛన్లు పంపిణీ చేస్తోందన్నారు. చంద్రబాబు, కరువు కవల పిల్లలన్నారు. బాబు 15 ఏళ్ల పాలనలో ఒక్క మంచి పథకం అయినా పంపిణీ చేశారా అని ఆయన ప్రశ్నించారు. దేశంలో ఇంత మొత్తం ఏ రాష్ట్రంలో పింఛన్లకు పంపిణీ చేయడం లేదన్నారు. పార్టీలకతీతంగా, అర్హతే ప్రామాణికంగా పథకాలు అందించిన ఘనత జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఎన్నికలు ఎపుడు జరిగినా ప్రజలంతా 100శాతం పోల్ చేయాలన్నారు. 75శాతం ఓట్లతో 175 సీట్లను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సాధించి తిరిగి అధికారంలోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డిగారి వీరారెడ్డి, పార్టీ నేతలు ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, శివ కుమార్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నాగిరెడ్డి, హరికేశవరెడ్డి, శ్రీనువాసులరెడ్డి, వెంకట్రామిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రామక్రిష్టారెడ్డి, ఓబుల్‌రెడ్డి, పుల్లయ్య, అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్ పాలన...

పెండ్లిమర్రి : పేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. పెండ్లిమర్రి ఎంపీడీవో కార్యాలయం సభా భవనంలో సోమవారం నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నూతనంగా 202 పింఛన్లు మంజూరయ్యాయన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి తలుపు తట్టి పింఛన్ అందజేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో పింఛన్ల కోసం వృద్ధులు, వికలాంగులు, గంటల తరబడి పంచాయితీ కార్యాలయం వద్ద పడిగాపు కాసేవారని గుర్తు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం జగన్ పింఛన్ సొమ్మును పెంచారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, మండల స్పెషలాఫీసర్ ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్ రెడ్డి, ఆగ్రో కార్పొరేషన్ డైరెక్టర్ చావలి శివ, సర్పంచ్ నాగమల్లారెడ్డి, తహశీల్దార్ ఉదయ భాస్కర్ రాజు, ఎంపీడీవో అల్తాఫ్ హుస్సేన్, సర్పంచ్‌లు ఎంపీటీసీలు, పింఛన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

వారసత్వ కట్టడాలపై ప్రత్యేక దృష్టి పెట్టండి

కడప కల్చరల్: జిల్లాలోని పలు వారసత్వ కట్టడాలు ఇటీవల కురిసిన వర్షాలకు ప్రమాద స్థితిలో ఉన్నాయని, వాటి రక్షణకు ప్రత్యేక దృష్టి సారించాలని ఇంటాక్ జిల్లా కన్వీనర్ ఎస్.ఎలియాస్‌రెడ్డి, సభ్యులు సట్టి భారవి కోరారు. వారం రోజుల కిందట అన్నమయ్య జిల్లాలో అత్యంత పుణ్య, పర్యాటక క్షేత్రమైన శ్రీ సౌమ్యనాథస్వామి ఆలయంలోని ప్రహరీ కొంతమేర కూలిపోవడం బాధాకరమన్నారు. వరుస వర్షాలతో తడిచిన కారణంగా గోడ కూలిందని వారు పేర్కొన్నారు. ఇలా వరుస వర్షాల అనంతరం జిల్లాలోని అన్ని ఇతర వారసత్వ కట్టడాలను పరిశీలించాలని, అటు ఆ చారిత్రక పురాతన కట్టడాలను కూలిపోకుండా సంరక్షించుకోవడమే కాకుండా ప్రమాదాలను నివారించవచ్చని వారు సూచించారు. సౌమ్యనాథస్వామి ఆలయంలో కూలిన ప్రహారిని వెంటనే పరిశీలించాలని, పున్ననిర్మాణానికి యుద్ధ ప్రాతిపదికపై చర్యలు చేపట్టాలని కోరారు. తాము ప్రత్యేకంగా పురావస్తుశాఖకు ఈ విషయంపై లేఖ పంపుతున్నామని వివరించారు.

రేపు గూడారవల్లి పూజలు

కడప కల్చరల్ : ధనుర్మాసంలో 29వ రోజును ఎంతో పవిత్రమైనదిగా, ముఖ్యమైనదిగా భావిస్తారని, ఈ సందర్భంగా సంప్రదాయంగా నిర్వహించే గూడారవల్లి పూజలను బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు విజయ్‌భట్టర్ తెలిపారు. ఉదయం 4.45 నుంచి 6.30 గంటల వరకు గోదాదేవి అమ్మవారికి అభిషేకం, అలంకారం చేసి పల్లకీలో కొలువుదీరుస్తామని వివరించారు. స్థానిక మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తామని, భజనలు, విశేష పూజలు కూడా ఉంటాయని తెలిపారు.

దిశ యాప్‌పై అవగాహన అవసరం

ఎస్ఐ అరుణ్‌రెడ్డి


విద్యార్థినిలకు దిశయాప్, సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ అరుణ్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : దిశ యాప్, సైబర్ నేరాల పట్ల విద్యార్థినిలు అవగాహన కలిగి ఉండాలని చింతకొమ్మదిన్నె ఎస్ఐ అరుణ్‌రెడ్డి తెలిపారు. నగర శివార్లలోని నారాయణ జూనియర్ కళాశాల హాస్టల్ విద్యార్థినులకు దిశ యాప్, దానివల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలిజేశారు. విద్యార్థినిలు ప్రమాదకర పరిస్థితుల్లో అత్యవసరమైన డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు. అనంతరం ఆయన మహిళలపై జరిగే నేరాలను ఏ విధంగా ఎదుర్కోవాలన్న అంశాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీడలు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయి

కమలాపురం: క్రీడలు మానసిక ప్రశాంతతను, శారీరక దృఢత్వాన్ని కలిగించడంతో పాటు ఆరోగ్యం, ఆత్మ విశ్వాసం పెంపొందిస్తాయని సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాల కరస్పాండెంట్ రాజగోపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఆ కళాశాలలో భారత ప్రభుత్వం, యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, మదర్ థెరిసా సేవా సమితి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని వాలీబాల్ పోటీలను కరస్పాండెంట్ ప్రారంభించారు. నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి మణికంఠ మాట్లాడారు. పోటీల్లో పాల్గొన్న కమలాపురం కింగ్స్ టీం ప్రథమ స్థానంలో, డిగ్రీ కళాశాల టీం ద్వితీయ స్థానంలో నిలిచారు. విజేతలకు వరుసగా రూ.3వేలు, రూ.2వేలు నగదు బహుమతితో పాటు ట్రోఫీ, సర్టిఫికెట్లను నిర్వాహకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మదర్ థెరిసా సేవా సమితి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు జూటూరు విజయ్, పీఈటీ నరహరి, క్రీడాకారులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలి

వీరపునాయునిపల్లె: మండలంలోని పాఠశాలల అభివృద్ధికి ప్రధానోపాధ్యాయులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి జాఫర్ సాదిక్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సంగమేశ్వర ఉన్నత పాఠశాల(ఎయిడెడ్)లో ప్రభుత్వం, యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పాఠశాల అభివృద్ధి, ఆవాస ప్రాంత ప్రణాళిక, యు డైస్‌పై ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన మండల విద్యాశాఖాధికారి జాఫర్ సాధిక్ మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి ఎటువంటి కార్యక్రమాలు చేపట్టాలో పేర్కొనాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మురళీక్రిష్ణ, పాల్గొన్నారు.

నేడు వల్లూరులో గడప గడపకు..

వల్లూరు: వల్లూరు సచివాలయ పరిధిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డిగారి వీరారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వల్లూరు సచివాలయ పరిధిలోని లింగాయపల్లె, సి.కొత్తపల్లె గ్రామాలల్లో నిర్వహిస్తున్న గడ పగడపకు కార్యక్రమానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి హాజరు కానున్నారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.